సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

ఆదివారం | 10 నవంబర్ | 2024



ఫొటోగ్రాఫర్లకు ఉపాధి గండం
ప్రస్తుత కాలంలో స్మార్ట్‌ఫోన్లతో ఫొటోగ్రాఫర్లకు జీవనోపాధి దెబ్బతింటోంది. వినియోగదారుల ఆదరణ లేక చాలా చోట్ల స్టూడియోలను ఎత్తివేస్తున్నారు. - 8లో▸



జాతరకు వేళాయె..
రేగొండ మండలంలోని తిరుమలగిరి శివారు గుట్టల్లో వెలసిన బుగులోని వెంకటేశ్వర స్వామిని భక్తులు కొంగు బంగారంగా కొలుస్తున్నారు. - 9లో▸

గరిష్టం/కనిష్టం
32.7^0/19.1^0

వాతావరణం
జిల్లాలో ఉదయం మంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. రాత్రి పొగమంచుతో పాటు చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సామూహిక దీపాలంకరణ



కాళేశ్వరం : కార్తీకమాసం సందర్భంగా కాళేశ్వరాలయంలో సామూహిక దీపోత్సవం, ఆకాశ దీపం వెలిగించే కార్యక్రమాన్ని వేద పండితులు భైకుంఠ పండా ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. దీపాలంకరణలో పాల్గొన్న మహిళలకు మట్టి ప్రమిదలు, ఒత్తులు, నూనె దేవస్థానం నుంచి ఉచితంగా అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మంత్రికి వినతిపత్రం



మల్హర్: రోడ్డును ధ్వంసంచేసిన ఏఎమ్మార్ కంపెనీపై చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు తాడిచర్ల, కాపురం గ్రామాల జెన్‌కో భూనిర్వాసిత హక్కుల సాధన కమిటీ సభ్యులు శనివారం హైదరాబాద్‌లో వినతిపత్రం అందజేశారు. మండలంలోని పెద్ద తాడిచర్ల ఊరచెరువు నుంచి ఖమ్మంపల్లి మానేరు వరకు ప్రజల సౌకర్యార్థం కోసం ఆర్ అండ్‌బీ శాఖ ద్వారా లక్షలు వెచ్చించి వేసిన రోడ్డును ఏఎమ్మార్ కంపెనీ తొలగించిందన్నారు. ప్రజలకు, ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని చెప్పారు. ఎన్నిసార్లు కంపెనీ దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మంత్రికి వివరించారు. ఏడేళ్లుగా డేంజర్ జోన్‌లో నివసిస్తున్నామని, ప్రతీ రోజు ఓపెన్‌కాస్ట్‌లో బ్లాస్టింగ్ చేయడం వలన తమ ఇళ్లు బీటలు వారుతున్నాయని చెప్పారు. భయాందోళనలతో కాలం వెల్లదీస్తున్నామని తెలిపారు. తమ సమస్యను పరిష్కరించాలని ఈ సందర్భంగా విన్నవించారు. ఈ కార్యక్రమంలో తాడిచర్ల, కాపురం గ్రామాల జెన్‌కో భూ నిర్వాసితుల హక్కుల సాధన పోరాట కమిటీ అధ్యక్షుడు కేసారపు రవి, ప్రధాన కార్యదర్శి తాండ్ర సంతోష్, కమిటీ సభ్యులు ఇందారపు ఎల్లయ్య, మాటూరి మల్లయ్య పాల్గొన్నారు.

24, 25న సీపీఎం జిల్లా మహాసభ

భూపాలపల్లి అర్బన్: ఈ నెల 24, 25వ తేదీల్లో సీపీఎం జిల్లా మూడవ మహాసభ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బందు సాయిలు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మహాసభ జరుగుతుందన్నారు. మహాసభకు పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మహాసభకు కేంద్ర, రాష్ట్ర కమిటీ నాయకులు హాజరు కానున్నట్లు తెలిపారు.

పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లించాలి

భూపాలపల్లి అర్బన్: పదో తరగతి వార్షిక పరీక్ష ఫీజు చెల్లించాలని జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి రాజేందర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ నెల 18వ తేదీలోపు చెల్లించాలని సూచించారు. రూ.50 రుసుంతో డిసెంబర్ 2వ తేదీ వరకు, రూ.200 రుసుంతో డిసెంబర్ 21వ తేదీ వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉంటుదని తెలిపారు. అన్ని సబ్జెక్టులకు కలిపి రూ.125 పరీక్ష ఫీజు చెల్లించాలని సూచించారు. ఒకేషనల్ విద్యార్థులు రూ.60 అదనంగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన పట్టణ ప్రాంతాల విద్యార్థులు రూ.24వేలు, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు రూ.20వేల ఆదాయ ధ్రువీకరణ పత్రాలు సమర్పిస్తే పరీక్ష ఫీజు నుంచి మినహాయింపు ఉంటుందన్నారు.

నాంచారమ్మ గుడిని పునర్నిర్మించాలి

వెంకటాపురం(ఎం): మండల పరిధిలోని రామాంజాపూర్ పరిధిలో గల నాంచారమ్మ గుడి(పంచాకుటాలయం)ని పునర్నిర్మాణం పేరుతో తొలగించడంతో ఎరుకల కులస్తులు ఇబ్బందులకు గురవుతున్నారని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు అన్నారు. ఎరుకల నాంచారమ్మ గుడిని సంఘ నాయకులతో కలిసి ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గుడిని తొలగించడంతో శివలింగాలు ధ్వంసమవుతున్నాయని ఆరోపించారు. ఎరుకల ఆరాధ్యదైవమైన నాంచారమ్మ గుడిని వెంటనే పునర్నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎనిమిదేళ్లుగా నాంచారమ్మ గుడి స్థలంలో జాతర నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కేతిరి భిక్షపతి, నాయకులు సుభాష్, రాజశేఖర్, పాలకుర్తి సురేష్, బాపు, రాము, శ్రీరాములు, పోశాలు తదితరులు పాల్గొన్నారు.

కార్తీక శోభ..



గర్భగుడిలో అభిషేక పూజలు చేస్తున్న భక్తులు



స్ఫటిక లింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు

కార్తీకమాసం సందర్భంగా కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో కార్తీకశోభ నెలకొంది. శనివారం తెల్లవారుజాము నుంచి తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. ముందుగా త్రివేణి సంగమ గోదావరిలో పుణ్యస్నానాలు చేశారు. గోదావరిమాతకు పూజలు చేశారు. సైకత లింగాలు చేసి పూజించారు. అనంతరం స్వామివారి గర్భగుడిలో ప్రత్యేక అభిషేకాలు, అర్చన చేశారు. శ్రీశుభానందదేవి అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన పూజలు చేశారు. ఉసిరి చెట్టు వద్ద ప్రదక్షిణలు చేసి లక్షవత్తులు వెలిగించారు. లక్ష ముగ్గులు వేశారు. దీపాదానాలు చేశారు. రాత్రి గర్భగుడిలో లక్షపత్రి పూజలు ఘనంగా నిర్వహించారు. ఉపవాస దీక్షలు చేశారు. దీంతో ఆలయ పరిసరాలు, గోదావరి తీరంలో భక్తుల రద్దీతో సందడిగా మారింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు సుమారుగా 30వేల మంది భక్తులు దర్శనం చేసుకున్నట్లు ఆలయ అధికారులు అంచనా. శనివారం ఒక్క రోజు వివిధ పూజలు, లడ్డూ ప్రసాదాల ద్వారా రూ.4.95 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ వర్గాలు తెలిపారు.

– కాళేశ్వరం



సామూహిక అభిషేక పూజలకు హాజరైన భక్తులు

ఇక పక్కా 'నిఘా'

- సీసీ కెమెరాల ఏర్పాటుకు ఖాకీల కసరత్తు
- నెల రోజులుగా అవగాహన సదస్సులు
- జిల్లావ్యాప్తంగా మరో 800 'నేత్రాలు'
- అటవీ ప్రాంతాల్లో సోలార్ కెమెరాలు

భూపాలపల్లి: నేరాలను తగ్గుముఖం పట్టించేందుకు, నిందితులను సులభంగా గుర్తించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం భారీఎత్తున సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తోంది. సైబర్ క్రైంను అదుపు చేయడం, సెల్‌ఫోన్ల రికవరీలో ముందుండి ప్రశంసలు అందుకున్న జిల్లా పోలీసులు నెల రోజులుగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసే పనిలో నిమగ్నమయ్యారు. ప్రజలు, వ్యాపారుల సహకారంతో అధునాతనమైన నిఘా నేత్రాలను ఏర్పాటు చేయబోతున్నారు.

జిల్లా కేంద్రంలో భారీ ఎత్తున ఏర్పాటు..

భూపాలపల్లి పట్టణంలో ప్రస్తుతం పలు రహదారులు, మలుపుల వద్ద 65, నేను సైతం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన కెమెరాలు 360 వరకు పని చేస్తున్నాయి. జిల్లా కేంద్రం వ్యాప్తంగా పూర్తిస్థాయిలో కెమెరాలు లేనందున ఈసారి భారీ ఎత్తున ఏర్పాటు చేసేందుకు పోలీసుశాఖ కసరత్తు చేస్తుంది. ఈ మేరకు నెల రోజులుగా వ్యాపారులు, కాలనీవాసులకు స్థానిక పోలీసులు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఐరన్ అండ్ హార్డ్‌వేర్, సిమెంట్, హోంనీడ్స్, హాస్పిటల్స్, ఎలక్ట్రికల్, కిరాణ వర్తక తదితర సంఘాలకు చెందిన వారు రూ.లక్షల్లో ఆర్థిక సాయం అందించారు. ఆ డబ్బులతో ప్రధాన రహదారులపై 4 ఎంపీ, జూమ్ ఆప్షన్‌తో కూడిన వంద కెమెరాలు, బాంబులగడ్డ, గణేష్‌చౌక్, అంబేడ్కర్ సెంటర్‌లో యాంటి నంబర్ ప్లేట్ రికగ్నయిజేషన్(ఏఎన్‌పీఆర్) కెమెరాలు మూడు బిగించనున్నారు. గతంలో బిగించిన కెమెరాలు కోతుల బెడద, వర్షం కారణంగా పని చేయకుండా పోయేవి. దీంతో పోలీసులు వాటిని మరమ్మతు చేయించేందుకు ఆర్థికంగా ఇబ్బంది ఎదుర్కొనే వారు. ఈసారి అలాంటి ఇబ్బందులు రాకుండా నాణ్యమైన కెమెరాలను ఏర్పాటు చేయించడంతో పాటు కెమెరాలు బిగించిన వారే మూడేళ్ల పాటు సర్వీస్ ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎస్పీ ఆఫీస్‌లో కమాండ్ కంట్రోల్ రూం..

జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలన్నింటినీ పరిశీలించేందుకు ఎస్పీ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. మిగతా మండలాల్లో ఏర్పాటు చేసిన కెమెరాలను ఆయా పోలీస్‌స్టేషన్లలో మానిటర్ ద్వారా చూడవచ్చు. జిల్లాలోని మండల కేంద్రాల్లో ఏర్పాటుచేసిన వంద కెమెరాలను మాత్రం ఆన్‌లైన్ చేసి హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ రూంకు అటాచ్ చేశారు.



భూపాలపల్లి పట్టణంలో సీసీ కెమెరాల బిగింపు



ఎస్పీ ఆఫీస్‌లో కమాండ్ కంట్రోల్ రూం

అటవీ రహదారుల్లో సోలార్ కెమెరాలు..

విద్యుత్ సౌకర్యం లేని అటవీ ప్రాంతాల్లో సైతం సోలార్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు జిల్లా పోలీసు అధికారులు కసరత్తు చేస్తున్నారు. మావోయిస్టులు, కొత్త వ్యక్తులు, అసాంఘిక శక్తుల రాకపోకలను గమనించేందుకు భూపాలపల్లి మండలంలోని కమలాపూర్ క్రాస్‌రోడ్, మహదేవ్‌పూర్, పలిమెల, మహాముత్తారం మండలాల్లోని పలు గ్రామాల సమీప అటవీ ప్రాంతాల్లోని రహదారులపై, కాళేశ్వరం అంతర్రాష్ట్ర వంతెన వద్ద సోలార్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయబోతున్నారు.



జిల్లాలో ప్రస్తుతం ఉన్న కెమెరాలు **1,500**

పనిచేస్తున్నవి **1,100**

కొత్తగా ఏర్పాటు చేసేవి.. **800**

దీంతో ఇక్కడి పరిస్థితిని రాష్ట్ర రాజధానిలోని పోలీస్ బాస్‌లు పరిశీలించే అవకాశం ఉంది.

అతి తక్కువగా పలిమెల మండలంలోనే..

ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహద్దులోని పలిమెల మండలంలో మావోయిస్టుల ప్రాబల్యం ఎక్కువగా ఉంటుంది. ఈ మండలంలోనే సీసీ కెమెరాలు తక్కువగా ఉన్నాయి. ఆర్థికంగా వెనుకబడిన మండలం కావడంతో స్థానికులు, వ్యాపారులు అంతగా ముందుకు రావడం లేదు. దీంతో పోలీసులు అనుకున్న స్థాయిలో ఇక్కడ సీసీ కెమెరాలు బిగించలేకపోతున్నారు. పలిమెల, ముకునూరు, కనుకునూరు, లెంకలగడ్డ గ్రామాల్లో మాత్రమే సుమారు 40 నుంచి 50 కెమెరాలు ప్రస్తుతం పని చేస్తున్నట్లు సమాచారం.

కాటారం పీఎస్‌లో నాలుగు మానిటర్లు..

జిల్లా కేంద్రం తరువాత పెద్ద సెంటర్ అయిన కాటారం మండల కేంద్రంలో సైతం నిఘా నేత్రాలు ఏర్పాటు చేయబోతున్నారు. ఈ మండలంలో ఇప్పటికే 70 కెమెరాలు పనిచేస్తుండగా స్థానిక వ్యాపారుల సహకారంతో మండల కేంద్రంలో మరో 60 ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ కెమెరాలన్నింటినీ పరిశీలించేందుకు పోలీస్‌స్టేషన్‌లో నాలుగు 32 ఇంచుల మానిటర్‌లను ఏర్పాటు చేయబోతున్నారు.

నేరాలను అదుపు చేసేందుకు..

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు అదుపులోకి వస్తాయి. నిందితులను గుర్తించడం సులభతరం అవుతుంది. వ్యాపారస్తులతో పాటు ప్రతీ కాలనీవారు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం చాలా మంచిది. కమ్యూనిటీ, నేను సైతం కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని గ్రామాలు, కాలనీల్లో కెమెరాలు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నాం.

– కిరణ్ ఖరే, ఎస్పీ

గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్

భూపాలపల్లి అర్బన్: సింగరేణిలో కనీస మస్టర్లు చేయని గైర్హాజరు కార్మికులకు గనులపై కౌన్సెలింగ్ నిర్వహించి వారి ఇబ్బందులను తెలుసుకోనున్నట్లు ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏడాదికి ప్రతీ కార్మికుడు కనీసం 100 మస్టర్లకు అయినా హాజరుకావాల్సి ఉంటుందన్నారు. ఏరియాలో ఏడాదికి 75 మస్టర్లు కూడా చేయనివారు 262మంది కార్మికులు ఉన్నట్లు తెలిపారు. గతంలో జీఎం కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించినట్లు.. ఈ నెల 5వ తేదీ నుంచి గనులు, డిపార్ట్‌మెంట్‌లపై కుటుంబ సభ్యులతో కలిసి కౌన్సెలింగ్ నిర్వహించి వారి సమస్యలను పరిష్కరించనున్నట్లు చెప్పారు.

6వ గనిలో కౌన్సెలింగ్

ఏరియాలోని కేటీకే 6వ గనిలో గైర్హాజరు కార్మికులకు గని మేనేజర్ నాగరాజు ఆధ్వర్యంలో శనివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. గడిచిన ఎనిమిది నెలలో 75 మస్టర్లు చేయని 30మంది కార్మికులను కౌన్సెలింగ్‌కు పిలువగా 13మంది మాత్రమే హాజరయ్యారు. గైర్హాజరుకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వారికి సరైన సలహాలు ఇచ్చి రానున్న రోజుల్లో జరిగే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో గని అధికారులు శ్రావణ్‌కుమార్, రాంచందర్, కార్మిక సంఘాల నాయకులు శ్రీనివాస్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



సోలార్ ప్లాంట్‌ను సందర్శిస్తున్న విద్యార్థులు

సోలార్‌ప్లాంట్ సందర్శన..

ఏరియాలోని సింగరేణి పాఠశాల విద్యార్థులు పట్టణ సమీపంలోని సోలార్ విద్యుత్ ప్లాంట్ వైజ్ఞానిక సందర్శనకు వెళ్లినట్లు పాఠశాల కరస్పాండెంట్ మారుతి, ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సిరాణి తెలిపారు. సింగరేణి కాలరీస్ ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి గుండా శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్లాంట్‌ను సందర్శించారు. విద్యార్థులు సబ్జెక్టులలో పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి సందర్శన చేపట్టినట్లు ప్రధానోపాధ్యాయురాలు తెలిపారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తి గురించి ప్లాంట్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ ప్రవీణ్ విద్యార్థులకు వివరించారు.

న్యాయసేవలపై విస్తృత అవగాహన

- హైకోర్టు జడ్జి అలిశెట్టి లక్ష్మీనారాయణ

భూపాలపల్లి అర్బన్: గ్రామీణ స్థాయిలో సామాన్యుడి గుమ్మం వద్దకే న్యాయసేవలను తీసుకువెళ్లే విధంగా న్యాయసేవలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని హైకోర్టు జడ్జి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల అడ్మినిస్ట్రేటివ్ జడ్జి అలిశెట్టి లక్ష్మీనారాయణ అన్నారు. న్యాయసేవల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లక్ష్మీనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉచిత, సత్వర, సమాన న్యాయం అందించాలనే ఉద్దేశంతో న్యాయ సేవాధికార సంస్థలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. లోక్ అదాలత్‌ల నిర్వహణలో, రాజీమార్గంలో కేసులను పరిష్కారం చేయడంలో, న్యాయ అవగాహన కల్పించడంలో న్యాయ సేవాధికార సంస్థల పాత్ర ముఖ్యమైనదన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ నారాయణబాబు మాట్లాడుతూ.. జిల్లాలో న్యాయ సేవాధికార సంస్థ ప్రారంభం అయినప్పటి నుంచి దాదాపుగా వంద న్యాయ అవగాహన సదస్సులు నిర్వహించినట్లు చెప్పారు. బాల కార్మిక నిర్మూలన, చట్టాలపై అవగాహన, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య దినోత్సవం, ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ లాంటి ఎన్నో కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లు నిర్వహించి పెద్ద ఎత్తున కేసులను పరిష్కారం చేస్తున్నట్లు తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల జడ్జిలతో హైకోర్టు జడ్జి చర్చించారు. కార్యక్రమంలో ములుగు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూర్య చంద్రకళ, సీనియర్ సివిల్ జడ్జిలు జయరాం రెడ్డి, కన్హయ్యలాల్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి రామచంద్రారావు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జాబిశెట్టి సౌఖ్య, ఓఎస్‌డీ బోనాల కిషన్, స్థానిక న్యాయవాదులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి లక్ష్మీనారాయణ

వివరాలు నమోదు చేయాలి

- కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్


కాటారం: సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా జాబితాలో పేర్కొన్న ప్రతీ అంశానికి సంబంధించి వివరాలు సేకరించి నమోదు చేయాలని కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్ సర్వే ఎన్యుమరేటర్లు, అధికారులకు సూచించారు. మండలకేంద్రంలో కొనసాగుతున్న సర్వేను సబ్‌కలెక్టర్ పరిశీలించారు. సర్వేలో భాగంగా ఎన్యుమరేటర్లు సేకరిస్తున్న వివరాలు, నమోదు చేస్తున్న తీరుపై ఆరాతీశారు. సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కులం, తదితర అంశాల వివరాలు సేకరించాలని ఆదేశించారు. పొరపాట్లకు ఆస్కారం లేకుండా సర్వే సక్రమంగా చేపట్టాలని ఆదేశించారు. ఎన్యుమరేటర్లు, సర్వే సూపర్‌వైజర్లకు పలు సూచనలు చేశారు. మండల అధికారులు, సూపర్‌వైజర్లు నిరంతరం సర్వే కొనసాగుతున్న తీరును పర్యవేక్షించాలని తెలిపారు. ప్రజలు సర్వేపై అపోహలు పెట్టుకోవద్దని, సర్వే సిబ్బంది కోరిన వివరాలను అందజేసి సహకరించాలని సబ్‌కలెక్టర్ కోరారు. సబ్ కలెక్టర్ వెంట తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ బాబు, ఎంపీఓ వీరస్వామి, పంచాయతీ కార్యదర్శి షగీర్‌ఖాన్, సర్వే సిబ్బంది ఉన్నారు.



సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్

భూపాలపల్లి ఆర్టీసీ డీఎంగా హిందూ

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్‌గా ఆమంచ హిందూ శనివారం బాధ్యతలు స్వీకరించారు. డిపో మేనేజర్ లక్ష్మీనారాయణ రెండునెలల క్రితం దీర్ఘకాల సెలవుపై వెళ్లడంతో పరకాల ఆర్టీసీ డిపో మేనేజర్ రవిచంద్ర ఇన్‌చార్జ్‌గా విధులు నిర్వహించారు. ఈ క్రమంలో హైదరాబాద్ సిటీ రీజినల్ మేనేజర్ కార్యాలయంలో అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్), ఏఎం (టీ) విధులు నిర్వహిస్తున్న ఆమంచ హిందూకు పదోన్నతి కల్పించి భూపాలపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్‌గా బదిలీ చేయడంతో శనివారం భూపాలపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం డీఎం విలేకరులతో మాట్లాడారు. ఉద్యోగుల సమష్టి కృషితోనే భూపాలపల్లి ఆర్టీసీ డిపో రూ. 5,94,19,000 లాభాల్లో నడుస్తుందన్నారు. ఓఆర్ సైతం 100కు పైగా పెరిగిందని చెప్పారు. ఉద్యోగులను సమన్వయం చేసుకుంటూ డిపోను అభివృద్ధి బాటలో నడిపిస్తానన్నారు. అతి త్వరలోనే భూపాలపల్లి ఆర్టీసీ డిపో నుంచి శబరిమలైకి ప్రత్యేక బస్సులు నడిపిస్తామని తెలిపారు.



బాధ్యతలు స్వీకరించిన ఆమంచ హిందూ

కిరాయి భారీగా తగ్గింపు

శుభకార్యాలు, విహారయాత్రలు, తీర్థయాత్రలకు ఆర్టీసీ బస్సులను అద్దెను 15నుంచి 20 శాతం వరకు తగ్గించినట్లు డీఎం హిందూ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కిలోమీటరు ప్రకారం పల్లెవెలుగు బస్సు అద్దె రూ.68నుంచి రూ.52, ఎక్స్‌ప్రెస్ రూ.69నుంచి రూ.62కి తగ్గించినట్లు పేర్కొన్నారు.

తప్పులకు తావివ్వొద్దు

సర్వేలో పూర్తి సమాచారం అందించాలి

- కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ప్రత్యేక పర్యవేక్షణ అధికారి వినయ్‌కృష్ణారెడ్డి

భూపాలపల్లి: జిల్లాలోని ప్రతీ కుటుంబం సమగ్ర కుటుంబ సర్వే అధికారులకు సహకరించి ఎన్యుమరేటర్లకు పూర్తి సమాచారాన్ని తెలియజేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ సూచించారు. సర్వే ప్రక్రియను భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రెడ్డికాలనీలో శనివారం కలెక్టర్ పరిశీలించారు. ఎన్యుమరేటర్లు సర్వే నిర్వహిస్తున్న సరళిని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. 150 ఇళ్లను ఒక ఎన్యుమరేషన్ బ్లాకుగా ఏర్పాటు చేసి ఒక ఎన్యుమరేటర్‌ను నియమించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మున్సిపల్ ప్రత్యేక అధికారి సిద్ధార్థరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్ ఉన్నారు.

తప్పులకు తావివ్వొద్దు..

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో తప్పులు లేకుండా ఎన్యుమరేటర్లు నిబద్ధత, అంకితభావంతో పూర్తిచేయాలని జిల్లా ప్రత్యేక పర్యవేక్షణ అధికారి వినయ్‌కృష్ణారెడ్డి తెలిపారు. శనివారం గణపురం మండల శివారు కొత్తపల్లి, భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని హనుమాన్‌నగర్‌లో జరుగుతున్న సర్వే ప్రక్రియను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వే ప్రక్రియలో ప్రభుత్వ మార్గదర్శకాలను తూ.చా తప్పకుండా పాటిస్తూ ప్రజలకు ఇబ్బంది కలగకుండా చేయాలన్నారు. అన్ని కుటుంబాల వివరాలు సమగ్రంగా సేకరణ చేయాలని ఎన్యుమరేటర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్ శర్మ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ప్రత్యేక పర్యవేక్షణ అధికారి వినయ్‌కృష్ణారెడ్డి

మహోన్నత కార్యక్రమంలో భాగస్వామ్యం..

జిల్లా కలెక్టర్లు, ఎన్యుమరేటర్లు మహోన్నత కార్యక్రమంలో భాగస్వాములు అవుతున్నారని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. సర్వే ప్రక్రియపై హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయం నుంచి సీఎస్ శాంతి కుమారి, ప్రధాన కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానీయాలతో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, సీపీఓ బాబూరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కొనుగోళ్ల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులు

భూపాలపల్లి: వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలని జిల్లా ప్రత్యేక అధికారి వినయ్‌కృష్ణారెడ్డి జిల్లా అధికారులను తెలిపారు. శనివారం ఐడీఓసీ కార్యాలయంలో కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి ధాన్యం కొనుగోళ్లు, ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియపై రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్యా, మండల ప్రత్యేక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వినయ్‌కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. కేటాయించిన మిల్లుల్లో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పర్యవేక్షణకు ప్రతీ మిల్లుకు సిబ్బందిని నియమించాలని ఆదేశించారు. ఆన్‌లైన్ చేయడంలో జాప్యం జరిగితే రైతులకు పేమెంట్స్ చెల్లింపు ఆలస్యం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, సీపీఓ బాబురావు, డీపీఓ నారాయణరావు, డీఆర్‌డీఓ అవినాష్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే బదిలీలు

ఏటూరునాగారం: ఏటూరునాగారం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని బూటారం, మానసపల్లి–1 అంగన్‌వాడీల బదిలీలు నిబంధన మేరకే చేయడం జరిగిందని డీడబ్ల్యూఓ శిరీష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొంత మంది తెలియని అవివేకంతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు సరైన ఆధారాలు సమర్పించిన అనంతరం కలెక్టర్ ఆదేశాల మేరకే బదిలీలు చేపట్టినట్లు వివరించారు. వారి విధులను ఎవరైనా అడ్డుకుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అభ్యంతరాలు ఉంటే జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ కార్యాలయానికి రావాలని కోరారు.

నిట్‌లో సాంకేతిక సందడి..



నేనే ఫ్యూచర్ మేనేజర్..

ఇండస్ట్రీ ఏదైనా నేనే ఫ్యూచర్‌మేనేజర్ అంటూ మేనేజ్‌మెంట్ స్టడీస్ సొసైటీ ఏర్పాటు చేసిన ఈవెంట్ అబ్బురపరిచింది. వంద మంది ఒకే వేదికపై పాల్గొని ప్రదర్శన ఇవ్వగా సత్తా చాటి నేను ఫ్యూచర్‌మేనేజర్ అంటూ నైపుణ్యాన్ని ప్రదర్శించి ఆకట్టుకున్నారు. టెక్నోజియాన్ వేదికగా రాబోవు రోజుల్లో పారిశ్రామిక రంగంలోనూ రాణిస్తామంటూ అదరగొట్టారు.



కాయిన్ వెయ్యి.. చాక్లెట్ పట్టు

చెయ్యి చాపు.. కాయిన్ వేయ్.. చాక్లెట్ పట్టు అంటూ నగరానికి చెందిన రిత్విక్, ఆశిష్‌లు రూపొందించిన చాక్లెట్ డిస్పెన్సర్ ప్రత్యేకంగా ఆకట్టుకుంది. రోబోటిక్స్ టెక్నాలజీతో రూపొందించిన చాక్లెట్ డిస్పెన్సర్ మిషన్‌లో కాయిన్ వెయ్యగానే చాక్లెట్ అందజేస్తుంది.

నింగిలోకి ఏకకాలంలో నాలుగు మిసైల్స్



అక్షయ్ ఆటోమేటెడ్ మిసైల్ లాంచింగ్ సిస్టమ్‌ను నగరానికి చెందిన రాకేష్ ఆవిష్కరించాడు. ఏకకాలంలో నాలుగు మిసైల్స్‌ను నింగిలోకి పంపించేందుకు ఈ టెక్నాలజీ తోడ్పడుతుంది. ఆర్మీ రంగంలో ఆటోమెటెడ్ మిసైల్ లాంచింగ్ రాబోయే రోజుల్లో ప్రత్యేక భూమిక పోషించనుందని రాకేష్ తెలిపాడు.



టెక్నోజియాన్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఐఏఎస్ డాక్టర్ తనుజైన్





ఎగ్జిబిట్లు ప్రదర్శిస్తున్న విద్యార్థులు- కాజీపేట అర్బన్

రైళ్ల రాకపోకల పునరుద్ధరణ



ట్రాక్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

డోర్నకల్: డోర్నకల్ రైల్వే జంక్షన్ పరిధిలోని బైపాస్ మీదుగా శనివారం తెల్లవారుజాము నుంచి రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు. కొండపల్లి నుంచి భద్రాచలం రోడ్‌కు వెళ్తున్న గూడ్సు రైలు మూడు బోగీలు శుక్రవారం రాత్రి బైపాస్‌లో పట్టాలు తప్ప గా అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. రైలుకు సంబంధించిన 17, 18, 19వ బోగీలు పట్టాలు తప్పాయి. 17, 18వ బోగీలను ముందుకు, బ్యాక్ బోగీలను ఇంజన్ సాయంతో వెనకకు తరలించారు. అడ్డుగా ఉన్న బోగీని భారీ యంత్రాలతో పక్కకు తప్పించి దెబ్బతిన్న ట్రాక్‌కు మరమ్మతులు చేసి సుమారు మూడు గంటల వ్యవధిలోనే బైపాస్‌లో కొండపల్లి, భద్రాచలం రోడ్ స్టేషన్ల మధ్య రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు.

రెండు తలల మేక పిల్ల జననం



మృతి చెందిన మేకపిల్ల

నెల్లికుదురు: రెండు తలలతో మేక పిల్ల జన్మించింది. ఈ ఘటన శనివారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. నెల్లికుదురుకు చెందిన కావటి పిచ్చయ్యకు చెందిన మందలో ఒక మేక రెండు తలల పిల్లకు జన్మనిచ్చింది. పుట్టిన వెంటనే ఆ పిల్ల మృతి చెందింది. కాగా, జన్యులోపంతో అలా పుట్టిన మేకపిల్లలు జన్మించిన వెంటనే చనిపోతాయని పశువైద్యాధికారి తెలిపారు.

ఫొటోగ్రాఫర్లకు ఉపాధి గండం

స్మార్ట్‌ఫోన్ల దెబ్బకు విలవిల

- వినియోగదారుల ఆదరణ లేక అవస్థలు
- చాలా చోట్ల స్టూడియోల ఎత్తివేత
- ప్రభుత్వం పట్టించుకోవాలని వేడుకోలు

కాజీపేట : ఫొటో.. గతం తాలుకు తీపి గుర్తు. మరుపురాని, మరవలేని జ్ఞాపకం. ఎప్పటికీ చెదిరిపోని మధుర స్మృతి. అందుకే తమ జ్ఞాపకాలను భద్రపరచుకోవడానికి ప్రతి ఒక్కరూ ఫొటో తీయించుకునే వారు. దీంతో ఒకప్పుడు ఫొటో స్టూడియోలు కళకళలాడేవి. ఫొటోగ్రాఫర్లకు చేతినిండా పని లభించేంది. అయితే ప్రస్తుత కాలంలో స్మార్ట్ ఫోన్ల దెబ్బతో ఫొటోగ్రాఫర్ల జీవనోపాధి దెబ్బ తింటోంది. అధునాతన టెక్నాలజీతో మార్కెట్‌లోకి వస్తున్న స్మార్ట్ ఫోన్ల వైపే ప్రజలు మొగ్గుచూపుతున్నారు. దీంతో చిన్న కార్యక్రమాలకు ఫొటోగ్రాఫర్లను పిలవడం మానేశారు. వివాహాది, శుభ కార్యాలకు మాత్రమే వినియోగిస్తున్నారు. ఫలితంగా పెళ్లిళ్ల సీజన్ తప్ప మిగతా సమయంలో పెద్దగా గిరాకీ ఉండడం లేదని పలువురు ఫొటోగ్రాఫర్లు వాపోతున్నారు. క్రమేణా ఉపాధి కొరవడడంతో జిల్లాలో ఏటా ఫొటోగ్రాఫర్ల సంఖ్య తగ్గుతోంది.

ఉమ్మడి జిల్లాలో 1016కు పైగా స్టూడియోలు..

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సుమారు 1016 పైగా ఫొటో స్టూడియోలు, 7వేల మందికి పైగా ప్రత్యక్షంగా, పరోక్షంగా వృత్తిపైనే ఆధారపడి జీవించే ఫొటోగ్రాఫర్లు ఉన్నారు. ఉన్నత విద్యనభ్యసించిన వారు కూడా సరైన ఉద్యోగావకాశాలు లేక ఈ రంగంలోకి రావడంతో పోటీ పెరిగింది. ప్రస్తుతం సరైన ఉపాధి లేకపోవడంతో షాపుల అద్దెలు, కరెంట్ బిల్లులు, సిబ్బందికి జీతాలు చెల్లించలేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



అన్నింటా గడ్డుకాలం..

గతంలో ఫొటోగ్రాఫర్లు సరైన పని లేని సమయంలో కనీసం పాస్‌పోర్టు సైజు ఫొటోల ద్వారా అయినా ఉపాధి పొందే వారు. ప్రస్తుతం ఆ పరిస్థితి కూడా లేదు. ఎవరికి వారు తమ స్మార్ట్ ఫోన్‌లో ఫొటో తీసుకుని కలర్ లాబ్స్‌కు వెళ్లి ప్రింట్ తీసుకుంటున్నారు. కొందరు జిరాక్స్ సెంటర్లు, మీసేవ కేంద్రాల్లో కూడా పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీస్తుండడంతో ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్లు ఉసురుమంటున్నారు. దీనికి తోడు పెరిగిన పోటీ కారణంగా క్వాలిటీ కోసం లక్షలాది రూపాయల విలువైన అధునాతన కెమెరాలను వాడాల్సిన పరిస్థితి. వినియోగదారుల ఆదరణ కొరవడడంతో పూట గడవడమే కష్టంగా ఉన్న పరిస్థితుల్లో ఇంత పెట్టుబడి ఎలా పెట్టాలో తెలియక ఫొటోగ్రాఫర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పెళ్లిళ్ల సీజన్‌లో ఫర్వాలేదు..

మిగతా రోజులు ఎలా ఉన్నా పెళ్లిళ్ల సీజన్ మాత్రం ఫొటోగ్రాఫర్లకు ఆశాజనకంగా ఉంటోంది. ఈ సీజన్‌లో రోజుకు రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు సంపాదిస్తారు. కానీ పెరిగిన పోటీ కారణంగా డిమాండ్ ఉన్న రోజుల్లో కూడా తక్కువ ధరలకే పని చేయాల్సి వస్తోందని మరి కొందరు చెబుతున్నారు.


అద్దె కూడా చెల్లించలేకపోతున్నాం



కొన్ని స్టూడియోల్లో ఫొటోలు తీయడం రానివారికి కూడా కెమెరాలు ఇచ్చి మార్కెట్‌లోకి పంపుతున్నారు. వాళ్లు తక్కువ ధరకే వచ్చీరాని నైపుణ్యంతో పని చేస్తున్నారు. దీంతో నైపుణ్యం ఉన్న ఫొటోగ్రాఫర్లకు పనిలేకుండా పోతుంది. గిరాకీ లేక స్టూడియోల అద్దెలు కూడా చెల్లించలేక నేడు ఎంతో మంది ఇళ్లకే పరిమితమయ్యారు.

- పిల్లి అనిల్‌కుమార్, ఫొటోగ్రాఫర్, రహమత్‌నగర్

కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



సుదీర్ఘ కాలం నుంచి ఈ వృత్తిలో ఉన్నా. ఒకప్పుడు కళకళలాడిన స్టూడియోలు నేడు ఉపాధి లేక వెలవెలబోతున్నాయి. వెనుకబడిన ఫొటోగ్రాఫర్లను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం చేయూతనందిస్తూ ప్రోత్సహించాలి. ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి.

- తూర్పాటి జగదీశ్వర్, ఫొటోగ్రాఫర్ సంఘం అధ్యక్షుడు

స్మార్ట్‌ఫోన్లతో ఉపాధి తగ్గింది



స్మార్ట్‌ఫోన్ల రాకతో సీనియర్ ఫొటోగ్రాఫర్లకు సైతం ఉపాధి కొరవడింది. ప్రస్తుతం చిన్న కార్యక్రమాలకు ఫొటోగ్రాఫర్లను పిలువడం లేదు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. గిరాకీ లేక.. అద్దెలు చెల్లించలేక జిల్లాలో చాలా వరకు స్టూడియోలు కనుమరుగయ్యాయి.

-బొమ్మల అశోక్‌కుమార్, కాజీపేట



టెక్నాలజీని ఎవరూ ఆపలేరు



మారుతున్న టెక్నాలజీని ఎవరూ ఆపలేరు. అయితే ఫొటోగ్రాఫర్ల పనిని ఇతర వృత్తుల వారు చేస్తుడడంతో మా ఉపాధికి గండిపడుతోంది. మీసేవ కేంద్రాలు, కలర్ జిరాక్స్ సెంటర్లలో ప్రింటింగ్ బాక్స్‌ల ద్వారా పాస్‌పోర్టు సైజ్ ఫొటోలను ప్రింట్ తీసి ఇస్తున్నారు. దీంతో మాకు ఇబ్బందులు తప్పడం లేదు. దీని వల్ల నైపుణ్యం ఉన్న ఫొటోగ్రాఫర్లకు ఉపాధి లేకుండా పోతోంది.

-మంతిని మోహన్, ఫొటోగ్రాఫర్

పాపం.. పసివాడు

- తల్లి, తండ్రి మృతితో అనాథగా మారిన బాలుడు
- దాతలు, ప్రభుత్వం స్పందించి ఆశ్రయం కల్పించాలని గ్రామస్తుల వేడుకోలు



బాలుడు కొడగాని కార్తీక్



వీరేశం(ఫైల్)

దుగ్గొండి: 12 సంవత్సరాల క్రితం తల్లి, శనివారం తండ్రి మృతి చెందారు. దీంతో ఓ బాలుడు అనాథగా మారాడు. దీనిపై దాతలు, ప్రభుత్వం స్పందించి బాలుడికి ఆశ్రయం కల్పించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని రేబల్లె గ్రామానికి చెందిన కొడగాని వీరేశం–లలిత దంపతులు వ్యవసాయ కూలీలుగా జీవనం సాగించేవారు. లలిత 12 సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటికి కార్తీక్ 3 నెలల పసికందు. దీంతో కార్తీక్‌ను నానమ్మ లచ్చమ్మ, తండ్రి వీరేశం పెంచి పోషిస్తున్నారు. ఈ క్రమంలో వీరేశం(46) శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో 12 ఏళ్ల వయసు ఉన్న కార్తీక్ అనాథగా మారాడు. తండ్రికి తలకొరివి పెట్టిన బాలుడిని చూసి గ్రామస్తులు కన్నీరుమున్నీరయ్యారు. ఊరంతా బంధువులుగా మారి అంత్యక్రియలు నిర్వహించారు. దాతలు, ప్రభుత్వం స్పందించి బాలుడికి ఆశ్రయం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ ఎన్నారై సెల్ రాష్ట్ర ప్రతినిధి శానబోయిన రాజుకుమార్ గ్రామానికి చేరుకుని కార్తీక్‌ను ఓదార్చారు. అండగా ఉండి ఆదుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మేర్గు రాంబాబు, మాజీ ఎంపీటీసీ మోహన్‌రావు, కందిపల్లి శంకర్, లింగారావు, అనిల్, నిఖిల్, ప్రసాద్, చంటి, రేబల్లె గ్రామ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

శిల్ప కళాసంపద మహాద్భుతం



ఖుష్‌మహల్‌ను తిలకిస్తున్న హైకోర్టు జడ్జి జస్టిస్ సుజయ్ పాల్



భద్రకాళి అమ్మవారి సన్నిధిలో జస్టిస్ సుజయ్ పాల్

- హైకోర్టు జడ్జి జస్టిస్ సుజయ్ పాల్

ఖిలా వరంగల్: కాకతీయుల శిల్ప కళాసంపద మహాద్భుతంగా ఉందని హైకోర్టు జడ్జి జస్టిస్ సుజయ్ పాల్ కొనియాడారు. శనివారం కాకతీయుల రాజధాని మధ్యకోటను కుటుంబ సమేతంగా సందర్శించారు. ఈ సందర్భంగా కాకతీయులు కీర్తితోరణాల మధ్య ఉన్న అద్భుత శిల్పకళాసంపదతోపాటు ఖుష్‌మహల్, రాతి, మట్టికోట అందాలు, ఏకశిల గుట్ట,శృంగారపు బావిని తిలకించారు. కాకతీయుల చరిత్ర, విశిష్టతను టూరిజం ప్రమోషన్ అధికారి సూర్యకిరణ్, పర్యాటక శాఖ గైడ్ రవియాదవ్.. జడ్జి కుటుంబ సభ్యులకు వివరించారు. కాగా, హైకోర్టు జడ్జి జస్టిస్ సుజయ్ పాల్‌ను కార్పొరేటర్లు బి. ఉమ, వి. సువర్ణ సన్మానించారు. వారి వెంట హనుమకొండ, వరంగల్ న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తీగల జీవన్‌గౌడ్, టీజీటీడీసీ కోట ఇన్‌చార్జ్ గట్టికొప్పుల అజయ్, కేంద్రపురావస్తుశాఖ కోఆర్డినేటర్ శ్రీకాంత్, మాజీ కార్పొరేటర్ బైరబోయిన దామోదర్, బోగి సురేశ్, ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం, ఎస్సై సురేశ్ పాల్గొన్నారు.

దేవాలయాలను సందర్శించిన హైకోర్టు జడ్జి

హన్మకొండ కల్చరల్ : చారిత్రక రుద్రేశ్వరస్వామి వారి వేయి స్తంభాల, భద్రకాళి దేవాలయాలను హైకోర్టు జడ్జి జస్టిస్ సుజయ్ పాల్ శనివారం సందర్శించారు. అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతించారు. పూజలు నిర్వహించిన అనంతరం అర్చకులు.. జస్టిస్‌కు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు, మహాదాశీర్వచనం అందజేశారు.

చుక్కా సత్తయ్య తెలంగాణకే తలమానికం

- విగ్రహావిష్కరణలో పలువురు వక్తలు



సత్తయ్య విగ్రహావిష్కరణలో పలువురు ముఖ్యులు

లింగాలఘణపురం: ఒగ్గు కథ పితామహుడు, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత చుక్కా సత్తయ్య తెలంగాణ రాష్ట్రానికే తలమానికమని తెలంగాణ క్రాంతిదళ్ వ్యవస్థాపక అధ్యక్షుడు పృథ్వీ అన్నారు. శనివారం చుక్క సత్తయ్య స్వగ్రామం మాణిక్యాపురంలో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కలిసి ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఆల్ ఇండియా యాదవ మహాసభ మహిళా విభాగం అధ్యక్షురాలు, చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, దుబాయ్ ఇంటర్నేషనల్ నెక్ట్‌లెవల్ గోల్డెన్ ఈవెంట్ చైర్‌పర్సన్ ఉపాసనతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉస్తాద్ ఒగ్గు రవి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో పృథ్వీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ దేశ ప్రధానమంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రుల చేతుల మీదుగా ఎన్నో అవార్డులు అందుకున్న చుక్కా సత్తయ్య విగ్రహం ఏర్పాటు చేసుకోవడానికి ఏడేళ్లు పట్టిందని, అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఈ కార్యక్రమానికి రాకపోవడం బాధాకరమన్నారు. చుక్కా సత్తయ్య బహుజన వర్గానికి చెందిన వాడు కావడమే ఇందుకు కారణమని, బహుజనులంతా ఏకమై రాజ్యాధికారం దిశగా పయనించాలన్నారు. బొంతు శ్రీదేవి మాట్లాడుతూ చుక్కా సత్తయ్య చనిపోయే ఇరవై రోజుల ముందు తన ఇంటికి వచ్చి మాట్లాడి తనను ఆశీర్వదించారని గుర్తు చేశారు. ఉపాసన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత కళలను దేశ, విదేశాల్లో ప్రదర్శించేందుకు కృషి చేస్తున్నామని, ఒగ్గుడోలు కథను దుబాయ్‌లో ప్రదర్శించామన్నారు. వరంగల్ కళా క్షేత్రానికి చుక్కా సత్తయ్య పేరు పెట్టాలని, ట్యాంక్‌బండ్‌పై విగ్రహం ఏర్పాటు చేసి జనగామ జిల్లాకు ఆయన పేరు పెట్టాలని పలువురు వ్యక్తులు డిమాండ్ చేశారు. సమావేశంలో చుక్కా సత్తయ్య కుమారులు ఆంజనేయులు, శ్రీశైలం, నాయకులు సేవెల్లి సంపత్, శేఖర్, ముక్తాం, ఆయా జిల్లాల కురుమ సంఘం అధ్యక్షులు పాల్గొనగా ఒగ్గు డోలు కళాకారులు, బుడిగ జంగాల కళాకారులు పాల్గొని అతిథులకు ఘన స్వాగతం పలికారు.

'సూపర్' ఆస్పత్రికి నిలిచిన నీటి సరఫరా

- తీవ్ర ఇబ్బందులు పడిన రోగులు
- నిలిచిన డయాలసిస్ సేవలు



ఎంజీఎం : కాకతీయ మెడికల్ కళాశాల ప్రాంగణంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికీ నీటి కష్టాలు తప్పడం లేదు. మున్సిపల్ నీరు సరఫరా జరిగితే తప్ప ఆస్పత్రిలో వైద్యసేవలు అందని దుస్థితి నెలకొంది. పైపు లైన్ల మరమ్మతుల నేపథ్యంలో శనివారం నీటి సరఫరా నిలిచింది. ఫలితంగా ఆస్పత్రిలో ఎలాంటి బోర్లు లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సుమారు రూ. 150 కోట్ల వ్యయంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ఆస్పత్రిని కనీ సం బోర్లు వేయకుండా ఎలా నిర్మాణం చేపట్టారు.. ఏ విధంగా సదరు కాంట్రాక్టర్‌కు అప్పటి అధికారులు బిల్లులు చెల్లించారో తెలియని పరిస్థితి నెలకొంది. సుమారు వంద మంది రోగులు చికిత్స పొందుతున్న ఈ ఆస్పత్రిలో తాగునీరు దేవుడెరుగు.. బాత్‌రూమ్‌కు వెళ్లేందుకు సైతం నీరు లేకపోవడంతో నరకయాతన అనుభవించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నిలిచిన డయాలసిస్ సేవలు..

కిడ్నీ బాధితులకు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలోని నెఫ్రాలజీ విభాగం ద్వారా డయాలసిస్ సేవలు అందిస్తుంటారు. ఈ సేవలు పొందాలంటే ఆస్పత్రికి కచ్చితంగా నీటి సరఫరా జరగాలి. అయితే ఆస్పత్రికి నీటి సరఫరా లేకపోవడంతో ఈ సేవలు నిలిచాయి. ఆస్పత్రిలో ప్రస్తుతం మూడు మోటార్లు ఉండగా రెండు కొన్ని నెలలుగా మరమ్మతులకు నోచుకోవడం లేదు. అంతే కాకుండా ఆస్పత్రికి ఇంటి అవసరాలకు సరిపడా ఉపయోగించే 150 ఫీట్ల బోరు మాత్రమే అందుబాటులో ఉంది. 250 పడకల ఆస్పత్రికి కనీసం రెండు, మూడు బోర్లు అందుబాటులో ఉంటే తప్ప రోగులకు భరోసా అందించలేం. అలాంటి నీటి సరఫరా విషయంలో అధికారుల నిర్లక్ష్యం వహించడంపై రోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నాం..

మున్సిపల్ నీటి ద్వారా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అవసరాలు తీరుతున్నాయి. ఆస్పత్రిలో బోర్ల సౌకర్యం లేదు. ప్రస్తుతం వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసి రోగులకు సేవలు అందిస్తున్నాం. నూతన బోర్లు సైతం అందుబాటులోకి తెచ్చి రోగులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం

- మురళి, సూపరింటెండెంట్, ఎంజీఎం

అతడు.. ఆమెగా

ఓ మహిళ ఫొటోతో వివాహ వెబ్‌సైట్‌లో ప్రొఫైల్

- లైక్ కొట్టిన వృద్ధుడితో ఫోన్‌లో యువతిగా గొంతుమార్చి పరిచయం
- చివరికి పెళ్లికి సై అన్న ఆటోడ్రైవర్
- వరంగల్‌కు పిలిపించి మరో ఇద్దరికి కలిసి చితకబాదిన వైనం
- బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

హసన్‌పర్తి: కుటుంబ పోషణ భారంగా మారడంతో ఆ ఆటోడ్రైవర్ సులువుగా డబ్బులు సంపాదించాలన్న ఆశతో ఓ వివాహ వెబ్‌సైట్‌లో మహిళ ఫొటోతో ప్రొఫైల్ క్రియేట్‌చేశాడు. అదే మహిళ పేర సిమ్ కార్డులు తీసుకున్నాడు. ఆ ప్రొఫైల్‌ను లైక్ కొట్టిన ఓ వృద్ధుడితో ఫోన్‌లో ఆడగొంతుతో మాట్లాడి పరిచయం పెంచుకున్నాడు. చివరికి పెళ్లి దాకా తీసుకువచ్చాడు. వరంగల్‌కు రమ్మని చెప్పి మరో ఇద్దరితో కలిసి ఆ వృద్ధుడిని చితకబాది నగదు తీసుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆ ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు మహిళ కోసం గాలిస్తున్నారు. కేయూ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. హనుమకొండ రాంనగర్‌కు చెందిన గోదారి శేఖర్ ఆటో డ్రైవర్. ఆటోతో కుటుంబం గడవడం కష్టంగా మారింది. దీంతో సులువుగా డబ్బులు సంపాదించాలన్న ఆశతో పబ్లిక్‌గార్డెన్ సమీపంలో పరకాలకు చెందిన లక్ష్మి అనే మహిళతో పరిచయం పెంచుకున్నాడు. ఆమె పేరు, ఫొటోతో రెండు కంపెనీలకు చెందిన సిమ్‌కార్డులు తీసుకున్నాడు. జోడీ.కామ్ (jodi. com) వెబ్‌సైట్‌లో లక్ష్మీ పేర ఓ ప్రొఫైల్ క్రియేట్ చేసి ఫొటో అప్‌లోడ్ చేశాడు. ఈ ప్రొఫైల్‌కు యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామానికి చెందిన దేవులపల్లి శ్రీనివాస్ అనే వృద్ధుడు లైక్ కొట్టి వివరాలు నమోదు చేశాడు. ఈ క్రమంలో శ్రీనివాస్‌తో శేఖర్ తన పేరును లక్ష్మిగా పరిచయం చేసుకుంటూ ఆడ గొంతుతో మాట్లాడడం ప్రారంభించాడు.

వాట్సాప్‌లో చాటింగ్..

ఆ పరిచయం వాట్సాప్ చాటింగ్ వరకు వెళ్లింది. తనకు భార్య లేనందున పెళ్లి చేసుకుంటానని దేవులపల్లి శ్రీనివాస్.. శేఖర్ (లక్ష్మి)కు చెప్పగా అంగీకరించాడు. గత నెల 25న హనుమకొండ బస్టాండ్‌కు వస్తే, తన వారు వస్తారని శ్రీనివాస్‌కు.. శేఖర్(లక్ష్మి) ఫోన్ చేసి చెప్పాడు. ఆ రోజు శ్రీనివాస్ హనుమకొండ బస్టాండ్‌కు రాగా, గోపాలపురానికి చెందిన దుర్గం రాజయ్య, లక్ష్మయ్య అనే ఇద్దరిని శేఖర్ బస్టాండ్‌కు పంపించాడు. వారు శ్రీనివాస్‌ను ఆటోలో ఎక్కించుకుని కోమటిపల్లి రైల్వేట్రాక్ వద్దకు తీసుకెళ్లారు. అప్పటికే అక్కడికి చేరుకున్న శేఖర్ వారిద్దరితో కలిసి శ్రీనివాస్‌ను చితకబాదారు. రూ.24వేలు ఫోన్ పే చేయించుకున్నారు.

బాధితుడి ఫిర్యాదు,.. కేసు నమోదు..

బాధితుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీస్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ దర్యాప్తు వేగవంతంగా చేశారు. గోపాలపురం శివారులో నిందితుడు శేఖర్‌తోపాటు దుర్గం రాజయ్య, లక్ష్మయ్యలను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు ఏసీపీ తెలిపారు. ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఏసీపీ చెప్పారు. మరో నిందితురాలు లక్ష్మి పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితులనుంచి రూ.24వేల నగదు, మూడు సెల్‌ఫోన్లు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. కేయూ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎస్సైలు రవీందర్, ప్రవీణ్ పాల్గొన్నారు. కేసును ఛేదించిన ఇన్‌స్పెక్టర్ రవికుమార్‌ను ఏసీపీ అభినందించారు.

మహిళ దారుణ హత్య

- గుర్రంపేటలో ఘటన

భూపాలపల్లి రూరల్: మేకల కాపరిగా పని చేస్తున్న ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. ఈ ఘటన ములుగు జిల్లా వెంకటాపూర్ పోలీస్ స్టేషన్ పరిధి, భూపాలపల్లి మండలంలోని గుర్రంపేటలో జరిగింది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సకినాల సరస్వతి (35) భర్త సుమారు 7 సంవత్సరాల క్రితం మృతి చెందాడు. కూతురుకు వివాహం కాగా కుమారుడు రాకేశ్ వేరే చోట నివాసం ఉంటున్నాడు. సరస్వతి గ్రామానికి చెందిన తడుక రవి వద్ద మేకలు కాపరిగా పనిచేస్తూ వారి మేకల పాకలోనే ఒంటరిగా జీవనం కొనసాగిస్తోంది. ఈ క్రమంలో శనివారం ఉదయం మేకల పాక శుభ్రం చేసేందుకు వెళ్లిన ఇతర కాపరులకు సరస్వతి దారుణ హత్యకు గురై కనిపించింది. గొంతకోసి ఉండి గురై రక్తపు మడుగులో నిర్జీవంగా ఉండడం గమనించిన వారు.. ఈ విషయాన్ని వెంటనే గ్రామపెద్దలతోపాటు పోలీసులకు తెలిపారు. దీంతో ములుగు సీఐ శంకర్, ఎస్సై సతీశ్ ఘటనా స్థలిని పరిశీలించారు. హత్యకు గల కారణాలు, నిందితుల గుర్తింపు కోసం డాగ్ స్క్వాడ్, ఫింగర్ ప్రింట్ బృందాలతో ఆధారాలు సేకరించారు. ఒంటరి మహిళ దారుణ హత్యకు గురికావడంతో గ్రామం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఈ ఘటనపై మృతురాలి సోదరుడు మధు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ శంకర్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించామని సీఐ పేర్కొన్నారు.